క్లుప్తంగా

తప్పిన ప్రమాదం



నేల కొరిగిన భారీ వేప వృక్షం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో స్థానిక బయటిపేట ఆంజనేయ స్వామి దేవస్థానంలో వందల ఏళ్ల నాటి భారీ వేప చెట్టు బుధవారం తెల్లవారుజామున కూలిపోయింది. అయితే, ఆసమయంలో చెట్టు కింద భక్తులెవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. కూలిపోయే సమయంలో ఎలాంటి గాలి వాన లేదని, ఉన్నట్టుండి ఆలయ ప్రాకారంపై పడిపోయిందని ఆలయ అర్చకులు, వాచ్‌మెన్లు తెలిపారు. చెట్టు కూలిన విషయాన్ని తహసీల్దార్, ఎండోమెంట్ అధికారులకు ఈఓ వేణునాథరెడ్డి సమాచారం అందించారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ ప్రవేశానికి మే 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీవిద్యార్థులు ఇందుకు అర్హులన్నారు. ఓసీ,బీసీ విద్యార్థులు రూ.200,ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 ప్రకారం ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దూర ప్రాంతాల విద్యార్థినులకు హాస్టల్ వసతి ఉందని తెలిపారు.

నేటి నుంచి సయ్యద్ షా బందేషావలి ఉరుసు



విద్యుద్దీపాలంకరణలో సయ్యద్ బందేషావలి దర్గా

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలో హజ్రత్ సయ్యద్ షా బందేషావలి దర్గా ఉరుసు మహోత్సవం నేటి నుంచి ప్రారంభం కానుంది. తొలి రోజు గురువారం గంధోత్సవం, రెండోరోజు శుక్రవారం ఉరుసు ఉంటుందని నిర్వాహకుడు మహబూబ్‌బాషా తెలిపారు. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ జిల్లా కమలాపురంలోని దర్గా-ఏ-గఫ్ఫారియా ఖలీఫా శ్రీమౌలానా హజ్రత్ ఫైజుల్ ఖాదర్ షా ఖాద్రీ హాజరవుతారన్నారు.

సాక్షి గణపతికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

రేపు ఆది శంకర జయంతి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో వైశాఖ శుద్ధ పంచమి సందర్భంగా మే 2న ఆదిశంకరుల జయంతి ఉత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ ఎం శ్రీనివాసరావు తెలిపారు. పాలధార -పంచధారల వద్ద ఉన్న శంకరమందిరంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదిశంకరుల వారికి, శ్రీశైల క్షేత్రానికి చాలా దగ్గరి సంబంధం ఉంది. శంకరులవారు శ్రీశైలంలోని పాలధార -పంచధార వద్ద కొంతకాలం తపస్సు చేసి అక్కడే శివానందలహరి గ్రంథాన్ని రచించారు. ఈ శివానందలహరిలో శ్రీశైలక్షేత్రాన్ని, భ్రమరాంబా మల్లికార్జునులను స్తుతించారు. అలాగే యోగతారావళి గ్రంథంలో శ్రీశైలంలోనే సమాధిని పొందాలని అభిలషించారని చెబుతోంది.

● రుద్రవనం(రుద్రపార్కు)లోని రుద్రమూర్తికి మే 2న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ ఎం శ్రీనివాసరావు తెలిపారు.

ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు పక్కన గల బుగ్గన శేషారెడ్డి మెమోరియల్ ఇండోర్ స్టేడియంలో నెలరోజుల పాటు షటిల్ బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. స్టేడియం ఆవరణలో బుధవారం క్లబ్ సభ్యులతో కలిసి ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. 10 నుంచి 15 సంవత్సరాల లోపుగల బాల, బాలికలకు ప్రతి వేసవి కాలంలోనూ నెలరోజుల పాటు ఉచితంగా సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. వచ్చే వారం ప్రారంభమయ్యే సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో పాల్గొనేందుకు ఆసక్తి గల బాల, బాలికలు కౌన్సిలర్ నాగేంద్ర సెల్ : 8985702633 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి చేద్దాం

- కబ్జా కాకుండా మున్సిపల్ స్థలాలు కాపాడుదాం
- కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా



మునిసిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణాభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా అన్నారు. ప్రధానంగా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని చెప్పారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం కమిషనర్ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మునిసిపల్ స్థలాలు కబ్జాకు గురికాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని 42 వార్డుల అభివృద్ధికి ప్రణాళిక రచించాలన్నారు. సాయిబాబా నగర్ మెయిన్ రోడ్డు 40 అడుగుల నుంచి 60 అడుగుల వెడల్పు చేసే అంశాన్ని కౌన్సిలర్ కృష్ణమోహన్ విజ్ఞప్తి మేరకు వాయిదా వేశారు. గడువు ముగిసిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ గదుల నెలసరి అద్దెపై 33.33 శాతం పెంచేందుకు తీసుకున్న నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోఆప్షన్ సభ్యుడు సలాముల్లా కోరారు. అద్దెల పెంపు లీజుదారులకు భారం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వ జీఓ ప్రకారం ప్రార్థన స్థలాలకు పన్ను మినహాయింపు ఉందని అయితే 41వ వార్డు పరిధిలోని మసీదుకు రూ.4లక్షల పన్ను విధించారని, దీనిని పరిశీలించాలని స్థానిక కౌన్సిలర్ పున్నా రాజేశ్వరి కోరారు. సలీంనగర్ వరకు ఉన్న రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని కౌన్సిలర్ మేస చంద్రశేఖర్ విన్నవించారు. 8వ వార్డులో ఉన్న సచివాలయం ఖాళీ చేయడం జరిగిందని, అయితే బకాయి పడ్డ అద్దె, విద్యుత్ బిల్లులు చెల్లించాలని "న్సిలర్ తాహిద్ కోరారు. 38వ వార్డులో హిందు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ సావిత్రమ్మ కోరారు. స్థానిక వార్డులో మున్సిపల్ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని వాటిని కబ్జాకు గురికాకుండా చూడాలన్నారు. నంద్యాల పట్టణంలో మున్సిపల్ స్థలాలు ఎక్కడ ఉన్నా వాటిని అధికారులు సర్వే చేయించి కబ్జాకాకుండా కాపాడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదేశించారు. పట్టణంలో పారిశుద్ధ్యం లోపించిందని దీనిపై దృష్టి సారించాలని శానిటేషన్ అధికారులకు సూచించారు.అంతకు ముందు జమ్మూకాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశంలో కౌన్సిలర్లు మజీద్, అనురాధ, తౌహిద్, చంద్రశేఖర్, కలాం, సాధిక్, పరచూరి నారాయణమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి పాల్గొన్నారు.

3న సర్వ సభ్య సమావేశం

ఆళ్లగడ్డ: ఈ నెల 3న మండల సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులతో పాటు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరుకావాలని సూచించారు.

ఘనంగా బసవేశ్వర స్వామి జయంతి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక బైర్మల్ వీధిలోని బసవేశ్వర ఆలయంలో సంఘ సంస్కర్త పరమాత్మ బసవేశ్వర స్వామి జయంతి ఉత్సవాలను పట్టణ వీరశైవ సంక్షేమ సమాజం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శశిభూషణ సిద్ధాంతి, వీరశైవ సంక్షేమ సమాజం అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ సమాజంలో కులాలను మతాలను రూపుమాపేందుకు తొలి అడుగు వేసిన సంఘసంస్కర్త బసవేశ్వరుడు అన్నారు. సాయంత్రం పురవీధుల గుండా స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ప్రజలు



గ్రామంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం

వైభవంగా పెద్దమ్మ జాతర

గోస్పాడు: యాళ్లూరు గ్రామంలో పెద్దమ్మజాతర అంగరంగ వైభవంగా జరిగింది. 11 ఏళ్ల అనంతరం గ్రామపెద్దల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ మహోత్సవాన్ని జరిపారు. మంగళవారం రాత్రి అమ్మవారిని రామచావిడి వద్ద కొలువు చేసి ప్రత్యేకంగా అలకరించారు. గ్రామస్తులు కులమతాలకు అతీతంగా బుధవారం తెల్లవారుజాము నుంచే బోనాలు తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం గ్రామ చావిడి వద్ద కాయ కర్పూరాలు సమర్పించారు. జాతర సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇల్లు బంధువులు, మిత్రులతో కళకళ లాడింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలిరావడంతో గ్రామంలోని వీధులన్నీ జన సందోహాన్ని తలపించాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పెద్ద వాహనాలను పోలీసులు గ్రామం శివారులో పార్కింగ్ చేయించారు. ఉత్సవం నేపథ్యంలో మంత్రి ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గ్రామానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసులురెడ్డి, గోస్పాడు ఎస్ఐ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో 50 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న సీడీపీఓ చంద్రకళ

నంద్యాల(అర్బన్): బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు చొరవ తీసుకోవాలని జిల్లా బాలల సంరక్షణ అధికారిణి స్వప్న ప్రియదర్శిని, సీడీపీఓ చంద్రకళ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయంలో కిశోర వికాసంపై సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, బాలల హక్కులు, అక్రమ రవాణా, పోషకాహారాలపై బాలికల్లో చైతన్యం తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుజాత పాల్గొన్నారు.

బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం

బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దామని హెడ్స్ స్వచ్ఛంద సంస్థ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్యయాదవ్ అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం వివిధ మతాలకు చెందిన గురువులతో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యాక్సెస్ టు జస్టిస్ ప్రోగ్రాం జిల్లా కో ఆర్డినేటర్ రాజు, హెడ్స్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన..

స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో కిశోర వికాసంపై మండల లెవెల్ వర్క్‌షాప్ నిర్వహించారు. బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీఎం గుర్రప్ప ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 11-18 సంవత్సరాల వయస్సు గల బాలికలకు కిశోర వికాసంపై అవగాహన కల్పించాలన్నారు.



నిర్మానుష్యంగా దొర్నిపాడులోని ప్రధాన రహదారి

నిప్పుల వాన

దొర్నిపాడు: ఎండలు మండుతున్నాయి. ఉదయం పది గంటలు దాటితే బయటకు రాలేని పరిస్థితి. పగటి పూట ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతుండటంతో జనాలు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం సమయంలో మండలకేంద్రాలతో పాటు గ్రామాల్లోని ప్రధాన వీధులు, రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మరోవైపు చిన్నారులు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు నదులు, కుంటల్లో ఈత కొడుతూ సరదా గడుపుతున్నారు. మండే సూర్యుడిని తప్పించుకునేందుకు వృద్ధులు చెట్ల కింద కూర్చొని సేద తీరుతున్నారు. రెండుమూడురోజులుగా మండలంలో 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని, చిన్నారులు, వృద్ధులు బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు.



వేసవి తాపం తాళలేక క్రిష్టిపాడులోని కుందూలో ఈత కొడుతున్న చిన్నారులు

ఓంకారంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న స్వామి వారు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని గంగా ఉమా సమేత ఓంకారేశ్వరాలయానికి బుధవారం అక్షయ తృతీయ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పంచబుగ్గల కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించి ఓంకారేశ్వర స్వామిని, అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తర్వాత వ్యాస మహర్షి చేత ప్రతిష్టించబడిన ఆంజనేయ స్వామి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. నల్లమల కొండపై ప్రతిష్టించిన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను కాలి నడకన వెళ్లి భక్తులు సందర్శించారు. భక్తులకు కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో అన్నదానం చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

జాబితా ప్రదర్శన

నంద్యాల(అర్బన్): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న డాక్టర్(ఎస్ఏఏ) పొన్నాపురం కాలనీ, వంట మనిషి బాలసదనం ఆళ్లగడ్డ, హెల్పర్ కం రాత్రి కపలాదారులు బాల సదనం ఆళ్లగడ్డ, సిటీ ఇన్‌స్పెక్టర్ యోగా టీచర్ బాలసదనం ఆళ్లగడ్డ, సైకో సోషియల్ కౌన్సిలర్ వన్‌స్టాప్ సెంటర్ నంద్యాల జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ పోషణ అభియాన్ నంద్యాల సంబంధిత పోస్టులను నంద్యాల జిల్లా వెబ్‌సైట్ http:// nandyala.ap.gov.inలో అర్హులు, అనర్హుల జాబితాను ఉంచామని జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారత అధికారిణి లీలావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 3వ తేది సాయంత్రంలోగా రాత పూర్వకంగా ధ్రువ పత్రాలతో సంబంధిత కార్యాలయాల్లో ఫిర్యాదు చేయాలన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గురువారం నుంచి చేపట్టనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 2,14,058 మంది పింఛన్ దారులకు రూ.92.02 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు ఉదయం నుంచి పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. తొలిరోజే 100 శాతం పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు.

4న ఆలయ వార్షికోత్సవం

ఆత్మకూరు: ఈనెల 4న స్థానిక సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. 4న ఉదయం 7.13 గంటలకు ఆలయంలో దత్తాత్రేయ, నందీశ్వర పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 8 గంటలకు మూలవిరాట్‌కు అష్టోత్తర కలశాభిషేకం, మధ్యాహ్నం పూర్ణాహుతి, కలశ జల సంప్రోక్షణ, రాత్రి 7.30 గంటలకు ప్రాకారోత్సవం ఉంటుందన్నారు. ఈనెల 2, 3 తేదీల్లో ఆలయంలో శ్రీశ్రీశ్రీ జగద్గురు ఆదిశంకరాచార్యుల వారి పూజ, యాగశాల ప్రవేశం, నవగ్రహ వాస్తు, కలశ స్థాపన ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని సాయిబాబా కృపకు పాత్రులు కావాలన్నారు.

వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం విఫలం

బండిఆత్మకూరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ప్రజలు వాపోతున్నారు. నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను నియమించింది. వారు నాలుగు వారాలుగా తమకు ఉద్యోగ భద్రత కల్పించి, జీతాలు పెంచాలని విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. ఈక్రమంలో గ్రామాల్లో వైద్య సేవలు స్తంభించిపోయాయి. వృద్ధులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి వారి సేవలను ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

అల్లూరులో విగ్రహ ప్రతిష్ట వేడుకలు

నందికొట్కూరు: మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో బుధవారం విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి పాల్గొని వరసిద్ది వినాయక సుంకులా పరమేశ్వరి దేవి, ఎల్లమ్మ, సవారమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10.4 గంటలకు ఆలయాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురోహితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

సేవలతోనే గుర్తింపు

- జిల్లా పంచాయతీ అధికారి పదవీ విరమణ వేడుకలో జిల్లా కలెక్టర్ రాజకుమారి

గోస్పాడు: ప్రతి ఉద్యోగి తన విధి నిర్వహణలో అందించే సేవలతోనే గుర్తింపు లభిస్తుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. జిల్లా పంచాయతీ అధికారి షేక్ జమీఉల్లా పదవీ విరమణ సందర్భంగా బుధవారం నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీలో ఉన్న నేషనల్ పీజీ కళాశాల సమావేశపు హాలులో వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. షేక్ జమీవుల్లా పంచాయతీరాజ్ వ్యవస్థలో సుదీర్ఘకాలం పనిచేశారన్నారు. పలు కార్యక్రమాలను ఆయన విజయవంతంగా నిర్వహించారని అభినందించారు. జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, డీఎల్‌డీఓ శివారెడ్డి తదితరులు ఆయన సేవలను కొనియాడారు. అనంతరం పదవీ విరమణ పొందిన జిల్లా పంచాయతీ అధికారికి జిల్లా కలెక్టర్, తదితర అధికారులు పూలమాలలు, శాలువ వేసి ఘనంగా సత్కరించారు.

● ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కేసీ కెనాల్ కాంపౌండ్‌లోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా కేంద్రం నంద్యాలలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్త నిల్వ కేంద్ర ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో త్వరలో బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సంబంధిత ఇంజనీర్, రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బందిని ఆదేశించారు. రక్త నిల్వ కేంద్రానికి అవసరమయ్యే నూతన పరికరాలను, రక్తం నిల్వ చేసే యంత్రాలను కలెక్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కమిటీ వైస్ చైర్మన్ మారుతి కుమార్, కోశాధికారి నాగేశ్వరరావ్, కమిటీ సభ్యులు ఉస్మాన్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



బ్లడ్ సెంటర్ పరిశీలనలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సత్ప్రవర్తనతో మెలగాలి



ఉప కారాగారంలో ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శేషాద్రి

ఆళ్లగడ్డ: క్షణికావేశంలో నేరాలకు పాల్పడి శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు విడుదలయ్యాక సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి అన్నారు. స్థానిక ఉప కారాగారంలోని న్యాయ సహాయ కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఉన్న ఖైదీలతో ఏ ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఎప్పటి నుంచి రిమాండ్‌లో ఉంటున్నారు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులు ఉన్నారా అని ఆరా తీశారు. అలాగే జైలులో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఆర్థిక స్తోమత లేని రిమాండ్ ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయ సహాయం అందజేస్తామన్నారు.

మానసిక ఆరోగ్య విభాగం తనిఖీ

నంద్యాల(వ్యవసాయం): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి, లీగల్ సర్వీస్ యూనిట్ ఫర్ మానోనియ కమిటీ సభ్యులు న్యాయవాది శేషసాయి బాబు, జీవన్ కుమార్, పారా లీగల్ వలంటీర్‌లు బుధవారం శాంతిరామ్ జనరల్ ఆసుపత్రిలోని మానసిక వికలాంగుల విభాగాన్ని తనిఖీ చేశారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో మానసిక వికలాంగుల సంక్షేమం కోసం, వారికి న్యాయ సహాయం అందించడం కోసం ఎల్ఎస్‌యూఎం కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం వార్డులో మానసిక వికలాంగులతో కలిసి మాట్లాడారు న్యాయపరమైన హక్కుల గురించి వారికి తెలియజేశారు. కార్యక్రమంలో శాంతి రామ్ హాస్పిటల్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వసంత్, ఆర్. చవాన్, డాక్టర్ మధుసుదన రెడ్డి, డాక్టర్ పి. ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



వెలుగోడులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

వెలుగోడు: వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని మైనారిటీ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మౌలానా జావాద్ అహ్మద్, సీపీఎం నాయకులు రాజశేఖర్ డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌తో బుధవారం వెలుగోడులో చేపట్టిన ర్యాలీ విజయవంతమైంది. ముందుగా పహల్గామ్ టెరరిస్టుల దాడిలో మృతిచెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం ర్యాలీగా పాత బస్టాండ్ మర్కస్ మసీదు నుంచి మదిన సెంటర్‌కు చేరుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మైనారిటీల హక్కులను అణిచివేయాలని చూస్తోందన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దుచేసి ముస్లింల హక్కులను రక్షించాలన్నారు. పహల్గామ్ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి బహిరంగంగా ఉరి తీయాలన్నారు. దేశ భద్రత కోసం దేశం కోసం ఎటువంటి త్యాగానికైనా సిద్ధమన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం చేరుకుని తహసీల్దార్ శ్రీనివాసులకు వినతి పత్రం సమర్పించారు. ర్యాలీ సందర్భంగా ఆత్మకూరు సీఐ సురేష్‌కుమార్ రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం అబ్దుల్ కలాం, కో కన్వీనర్‌లు మౌలానా మహబూబ్ రహిమాన్, హిదాయత్ అలీఖాన్, మోమిన్ రసూల్, డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఇలియాస్ ఖాన్, రఫీ, సాబిర్ హుసేన్, వలీ, టైలర్ సయ్యద్, మొహమ్మద్ ఖాన్, లాయర్ సిద్ధిక్ పాల్గొన్నారు.



నర్సాపురం వద్ద వానకు తడవకుండా ధాన్యంపై పట్టలు కప్పుతున్న రైతులు



హరినగరంలో ఈదురుగాలులకు ట్రాక్టరుపై విరిగి పడిన భారీ వృక్షం

అకాల వర్షం..అపార నష్టం

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంతో పాటు ఆర్.నాగులవరం, నర్సాపు రం, ఆలమూరు, చిత్రేనిపల్లె, హరినగరం, ముత్తలూరు, టి.లింగందిన్నె, తండా, ముత్తలూరు తదితర గ్రామాల పరిధిలో బుధవారం సాయంత్రం భారీగా గాలులు వీస్తూ వర్షం కురిసింది. దీంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. ప్రస్తుతం రబీలో సాగు చేసిన వరి పంట కోతలు జోరుగా సాగుతున్నాయి. వచ్చిన ధాన్యాన్ని రోడ్లు, బయలు ప్రదేశాల్లో రైతులు ఆరబెడుతున్నారు. హఠాత్తుగా పెద్ద గాలి వీచడంతో కొన్ని చోట్ల కోత దశలో ఉన్న వరిపైరు నేలకొరగగా ఆరబెట్టిన వడ్లు వానకు తడిసిపోయాయి.

హరినగరంలో ఇంటి ప్రాంగణంలో ఉన్న ట్రాక్టరుపై భారీ వృక్షం కూలిపడింది. మామిడి కాయలు కుప్పలుగా రాలి పడ్డాయి. ఉన్నతాధికారులు స్పందించి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.